సాక్షి
ములుగు
ఆదివారం । 28 । మే । 2023



ఉన్నతవిద్యలో వర్సిటీల పాత్ర కీలకం
ఉన్నత విద్యలో విశ్వవిద్యాలయాల పాత్ర కీలకంగా ఉండాల్సిన అవసరం ఉందని న్యాక్ పీర్ టీం చైర్మన్ ప్రొఫెసర్ సుగమ్ అన్నారు.
- 8లో▸



తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్
తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం అక్రమ, ఆర్థిక సామ్రాజ్య విస్తరణకు దోచుకుంటున్నాడని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు.
- 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.0°/27.0°
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడాకారులు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి



ములుగు: సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభను కనబరిచి ములుగు జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వైవీ.గణేశ్ సూచించారు. ఈ మేరకు పోటీలకు వెళ్తున్న క్రీడాకారుల వాహనాన్ని శనివారం అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ముందస్తు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, డీపీఓ కొండా వెంకయ్య, జిల్లా యువజన క్రీడల అధికారులు వెంకటరమణాచారి, తదితరులు పాల్గొన్నారు.

‘మత్తు చిత్తు’పై ఆరా!

కాళేశ్వరం: యువత మత్తు పదార్థాలకు బానిసలువుతుందని ‘మత్తు చిత్తు’ అనే శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి పోలీస్, నిఘావర్గాలు అలర్ట్ అయ్యాయి. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్లలో పోలీసులు యువతపై ఆరా తీస్తున్నారు. మత్తుకు బానిసైన యువతను కనుక్కునే పనిలో పడ్డట్లు తెలిసింది. మద్యం, గంజాయి, మత్తు కలిగించే ఇతర పదార్థాలు ఎక్కడ లభిస్తున్నది.. వాటిపైన పలు దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు సమాచారం. భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్ మండలాలతో పాటు కాళేశ్వరం ప్రాంతంపై ఎక్కువగా ఫోకస్‌పెట్టినట్లు తెలిసింది.

జూన్ 8నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

భూపాలపల్లి రూరల్: జూన్ 8, 9, 10 తేదీల్లో జిల్లా కేంద్రంలో ఆహార మేళా (ఫిష్ ఫుడ్ ఫెస్టివల్) నిర్వహించనున్నట్లు.. ఈ మేళాను మత్స్యకారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజులపాటు జరిగే ఈ మేళాలో (10) స్టాల్స్ ఏర్పాటుచేసి వివిధ రకాల చేపలు, రొయ్యల ప్రత్యేక వంటల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వంటకాల్లో అనుభవం ఉన్న.. ప్రత్యేకంగా శిక్షణ పొందినవారు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు ముందస్తుగా జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గెలుపే లక్ష్యం

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ (లీడర్ షిప్ డెవలప్ మెంట్ మిషన్) కో ఆర్డినేటర్ ఇర్షద్ అహ్మద్ నసీర్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నసీర్ మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అందుకోసం నియోజకవర్గ, మండల, అర్బన్, రూరల్ కమిటీలు వేయాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ ప్రతి గడపకు వెళ్లేటట్లు ప్రచారం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు.నాయకులు పసునూటి రాజేందర్, అర్బన్ అధ్యక్షుడు విస్లావత్ దేవన్, భువన సుందర్, కంచర్ల సదానందం, రజనీకాంత్, ఉస్మాన్, గట్టు రాజు పాల్గొన్నారు.

ఎదురుచూపులు

తొమ్మిదేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

- 2019లో కొన్ని పంపిణీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో ఇంకా 2,831 పెండింగ్ దరఖాస్తులు

2019- 2023 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల వివరాలు

మండలం	దరఖాస్తుల సంఖ్య
ఏటూరునాగారం	350
గోవిందరావుపేట	217
కన్నాయిగూడెం	136
మంగపేట	489
ములుగు	589
తాడ్వాయి	165
వెంకటాపురం(ఎం)	322
వెంకటాపురం(కె)	342
వాజేడు	221
మొత్తం	2,831



రేషన్ షాపులో బియ్యం కాంటా వేస్తున్న దృశ్యం(ఫైల్)

ఏటూరునాగారం: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినా తొమ్మిదేళ్లలో ఒకే ఒక్కసారి రేషన్ కార్డులను కొంతమంది నూతన దంపతులకు 2019లో ప్రభుత్వం పింపిణీ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు ఇంత వరకు రాలేదు. ఆ పంపిణీలో కేవలం పరిమితి సభ్యులకే ఇవ్వడంతో మిగతా వారికి నిరాశే మిగిలింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని తొమ్మిది సంవత్సరాలుగా ఎదురు చూస్తూ ఉండిపోతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలోనైనా కొత్త రేషన్‌కార్డులు వస్తాయని దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. అయితే రేషన్ కార్డు ఉంటేనే కొన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకం, ఆరోగ్యశ్రీ, ఇతర పెద్దాస్పత్రుల్లో రాయితీలు రేషన్‌కార్డుకు ముడిపడి ఉన్నాయి. అంతేకాకుండా చిన్నారుల ఎడ్యుకేషన్‌కు సంబంధించి కూడా రేషన్ కార్డుల ఆధారం అవసరం ఉంటుంది. దీంతో పాటు నిరుపేద, మధ్యతరగతి వారు పెరిగిన ధరలకు ప్రైవేటుగా బియ్యాన్ని కొనుగోలు చేసుకొని తినలేని పరిస్థితి ఉంది. రేషన్ కార్డులు ఉంటే సన్న, దొడ్డు రకం బియ్యం తెచ్చుకొని రెండు పూటలా కడుపు నింపుకునే అవకాశాలున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకోవాలని దరఖాస్తుదారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

మంజూరుపై ఉత్తర్వులు రాలేదు..

అయితే ఇటీవల సోషల్ మీడియాలో జూన్ 1 నుంచి కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయని ప్రభుత్వ మద్దతుదారులు, ఇతర బ్రోకర్లు ఈ మేసేజ్‌లు పెట్టడంతో లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు. ప్రభుత్వం ఉత్తర్వులు వస్తే అర్హులకు కార్డులు ఇస్తామని తెలిపారు. దళారులను ఎవరిని కూడా నమ్మవద్దని సూచించారు.

9 మండలాల్లో.. 174 గ్రామాలు

జిల్లాలోని 9 మండలాల్లోని 174 గ్రామాలు ఉన్నాయి. 222 రేషన్ షాపులు ఉండగా 89,316 కార్డులు ఉన్నాయి. తెల్లరేషన్ కార్డులు 81,276, అంత్యోదయ 8,038, అన్నపూర్ణ కార్డులు 2 ఉన్నాయి. ఒక్కో కార్డుదారుడికి 5 కిలోల బియ్యం ఇస్తున్నారు. అయితే నూతన దంపతులు, కుటుంబంతో విడిపోయి వేరే కాపురం పెట్టిన వారు.. వేరే ఊరు నుంచి వచ్చి స్థిర పడినవారు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు.

భూసేకరణకు సహకరించాలి



పూజారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమాదేవి

ములుగు: మేడారం సమ్మక్క–సారమ్మల ఆలయం చుట్టూ దేవాదాయ శాఖ చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అవసరమైన భూ సేకరణకు సహకరించాలని ఆర్డీఓ కూతాటి రమాదేవి కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమ్మక్క–సారలమ్మల పూజారులు, ప్రజా ప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామన్నారు. రైతులు నష్టపోకుండా చూస్తామని తెలిపారు. ఈ సమీక్షలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ బడె నాగజ్యోతి, తహసీల్దార్ శ్రీనివాస్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సర్పంచ్ చిడెం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ప్రణాళిక రూపొందించాలి



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ములుగు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో పలు రకాల కార్యక్రమాలను నిర్వహిచడానికి ప్రణాళిక రూపొందించాలని ఎస్పీ గాష్‌ఆలం సూచించారు. జిల్లా కేంద్రంలో పోలీస్ అధికారులతో ఎస్పీ శనివారం సమీక్ష నిర్వహించారు. బ్లూకోల్ట్, డయల్ 100 సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీలు నిర్వహించాలన్నారు. శాఖ తరఫున ఉచిత రక్తదాన శిబిరాలను నిర్వహించాలన్నారు. గిరిజన యువతీ, యువకులకు స్పోర్ట్స్ మీట్ చేపట్టాలన్నారు. రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్స్ ద్వారా కలిగే నష్టాలను వివరించేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఓపెన్ హౌజ్, ఆయుధ ప్రదర్శన, పోలీసుల విధులు, మహిళల భద్రతకు పోలీసు శాఖ చేపడుతున్న విషయాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, అదనపు ఎస్పీ కమాండెంట్ సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ సుభాష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ములుగు సీఐ రంజిత్‌కుమార్, సీసీఎస్ సీఐ రవీందర్, ఆపరేషన్ సీఐ కిరణ్, ములుగు ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

టీబీ రాకుండా జాగ్రత్త తీసుకోవాలి



సంతకం చేస్తున్న రవీందర్

ములుగు: టీబీ వ్యాధి సోకకుండా ప్రజలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని టీబీ నియంత్రణ అధికారి పోరిక రవీందర్ సూచించారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో నిక్షయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ టీబీ రోగులకు ఒంటరి అనే భావన రావద్దన్నారు. వైద్య సిబ్బంది భరోసా కల్పించాలని సూచించారు. ఇతరులకు వ్యాధి సోకకుండా చూడడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రిలో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్, డీపీఎం పుల్లూరు సమ్మయ్య పాల్గొన్నారు.

పాఠశాల పునః ప్రారంభంలోనే యూనిఫాం ఇవ్వాలి

- ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం



హెచ్‌ఎంలు, హెచ్‌డబ్ల్యూఓలతో మాట్లాడుతున్న డీడీ పోచం

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని 2023–24 విద్యా సంవత్సరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న బాల బాలికలకు యూనిఫాంలను పాఠశాలల పునఃప్రారంభంలోనే ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో హెచ్‌ఎంలు, హెచ్‌డబ్ల్యూఓలతో ఆయన శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పోచం మాట్లాడుతూ బాలబాలికలకు యూనిఫామ్స్ కుట్టించేందుకు పక్కా ప్లాన్ చేయాలన్నారు. ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి ములుగు, భూపాలపల్లి జిల్లాల దర్జీ సెంటర్ (టైలరింగ్) ఇన్‌చార్జ్‌లతో మాట్లాడి యూనిఫాంలు కుట్టే విధంగా చూడాలన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించక ముందే ఇచ్చేలా దర్జీలతో మాట్లాడి క్లాత్‌ను మండలాల వారీగా ఇచ్చి కుట్టించాలన్నారు. ముందుగానే అన్ని పాఠశాలల విద్యార్థుల కొలతలను తీసుకోవడం వల్ల ఈ యూనిఫాంలు కుట్టియడానికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. రెండు జిల్లాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా ఇన్‌చార్జ్‌లు బాధ్యత తీసుకొని దీనిపై పర్యవేక్షణ చేస్తూ జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సెంటర్ ఇన్‌చార్జ్ పీజీహెచ్ కె. శ్రీనివాస్, పీజీహెచ్ ఎం నాగేశ్వర్‌రావు, హెచ్‌డబ్ల్యూఓ మనోజ్‌కుమార్, హెచ్‌ఎంలు సరోజన, సమ్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణానికి భూ సర్వే

- వానాకాలం సమీపిస్తుండడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు



గోదావరి తీరం వెంట భూములను సర్వే చేస్తున్న అధికారులు

మంగపేట: మండల కేంద్రంలోని దొంగల ఒర్రె వద్ద నుంచి పొదుమూరు సమీపంలోని పుష్కరఘాట్ వరకు గోదావరి ఒడ్డు వెంట నిర్మించనున్న కరకట్ట నిర్మాణం పనులు చేపట్టేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు భూసేకరణ కోసం శనివారం సర్వే ప్రారంభించారు. ప్రతిఏటా వర్షాకాలంలో గోదావరి వరద కోత కారణంగా దొంగల ఒర్రె వద్ద నుంచి పుష్కరఘాట్ వరకు సాగు భూములు కోతకు గురై గోదావరిలో కలిసి పోతున్నాయి. కోట్లాది రూపాయల ఖర్చుతో పొదుమూరు సమీపంలోని గోదావరి ఒడ్డున నిర్మించిన పుష్కరఘాట్ వరద గతంలో వచ్చిన భారీ వరదల కారణంగా ధ్వంసం కాగా కిలోమీటర్ మేర బీటీ రోడ్డు ఇప్పటికే గోదావరిలో కలిసి పోయింది.

రూ.54.09 కోట్ల నిధులు మంజూరు

అదే విధంగా వరదల కారణంగా పొదుమూరుతో పాటు మండల కేంద్రమైన మంగపేటకు ప్రమాదం పొంచి ఉండటంతో ప్రభుత్వం దొంగల ఒర్రె నుంచి పుష్కరఘాట్ వరకు రెండున్నర కిలో మీటర్ల వరకు కరకట్ట నిర్మాణం చేపట్టేందుకు 2022 ఏప్రిల్‌లో రూ.54.09 కోట్ల ఫ్లడ్‌బ్యాంక్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు హర్ష కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. పనులు ప్రారంభించేందుకు గోదావరి ఒడ్డు నుంచి సుమారు 30 మీటర్ల వరకు రెండున్నర కిలో మీటర్ల మేర పొడవుగా అవసరమైన 50 నుంచి 60 ఎకరాల భూసేకరణ చేపట్టలేదు. దీంతో వర్షాకాలం సమీపిస్తుండటంతో యుద్ధ ప్రతిపాదికన ముందుగా భూసేకరణ చేపట్టేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గోదావరి తీరం వెంట ఉన్న భూములపై సర్వే నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కుమారస్వామి, సర్వేయర్ సఫియా సుల్తాన, ఇరిగేషన్ ఏఈఈ వలీమ్ మహ్మద్, సూపర్ వైజర్ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు



ద్వితీయ బహుమతి అందుకుంటున్న ములుగు జిల్లా జట్టు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యాయాదవ్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి ములుగు, తృతీయ స్థానం వికారాబాద్ జిల్లా జట్లు పొందాయి. బాలుర విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి వికారాబాద్, తృతీయ బహుమతి కామారెడ్డి జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి.

రామప్పకు చేరుకున్న సైకిల్‌యాత్ర



వెంకటాపురం(ఎం): జల, జంతు, వనాలను సంరక్షించుకోవాలనే నినాదంతో కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింగనూరుకు చెందిన ఛాత్రాతి విజయ గోపాలకృష్ణ దేశ వ్యాప్త సైకిల్ యాత్ర చేపట్టారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రామప్ప దేవాలయానికి సైకిల్ పై చేరుకున్న ఆయన రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని శనివారం విలేకర్లతో మాట్లాడారు. 2022 మార్చి 11న స్వగ్రామం నుంచి బయలుదేరి శనివారానికి 441 రోజుల్లో 15 రాష్ట్రాలు, అనేక దర్శనీయ దేవాలయాలు, అడవులు, జంతు ప్రదేశాలు, నదులను సందర్శించినట్లు తెలిపారు. ఈ యాత్ర మరో 59 రోజుల పాటు సాగించనున్నట్లు వివరించారు. తమ పూర్వికులది ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు మండలం కొమరవరం గ్రామమని తెలిపారు. 1971లో రాయచూరుకు వెళ్లి స్థిరపడ్డామని పేర్కొ న్నారు. ప్రస్తుతం భద్రాచలం మీదుగా మేడారం వనదేవతలను దర్శించుకొని రామప్ప ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. రామప్ప అనంతరం ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లనున్నట్లు వివరించారు. ఎక్కడకు వెళ్లినా అక్కడి సంస్కృతి సంప్రదాయాలతో తనకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారని వారందరికీ రుణపడి ఉంటానని విజయగోపాలకృష్ణ తెలిపారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషన్‌ను వెంటనే వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నెల రోజులుగా ఢిల్లీలో రెజ్లర్లు చేపడుతున్న ఆందోళనలకు మద్దతు తెలిపినట్లు ుఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం జరగాలని పోరాడుతున్న వారిపై కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడడం మానుకోవాలన్నారు. మహిళా రెజ్లర్లపై అనైతిక చర్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. వెంటనే బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రవీందర్, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, నర్సింగరావు, సత్యనారాయణ, శంకర్, కృష్ణ, నరేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని శాసించే స్థాయికి బీఆర్‌ఎస్

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



టేకుమట్ల: రాఘవాపూర్‌లో ఆది సర్వయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వినోద్‌కుమార్



చిట్యాల: స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను శంకుస్థాపన చేస్తున్న వినోద్‌కుమార్

టేకుమట్ల: ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి దేశ రాజకీయాలను శాసించే స్థాయికి బీఆర్‌ఎస్ చేరుకుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంతో పాటు, గర్మిళ్లపల్లిలో రూ.20లక్షల నిధులతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాఘవాపూర్‌లో మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆది రాంనర్సయ్య విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అభివృద్ధి అందరి కళ్ల ముందు ఉందన్నారు. కోటి ఎకరాలకు సాగు నీరు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్ట్ వంటివి దేశం గర్వించదగ్గ అభివృద్ధి అన్నారు. రాష్ట్రాన్ని మోసంచేసేందుకు భవిష్యత్‌లో ప్రతిపక్షాలు వస్తుంటాయని.. కావున ప్రతి ఒక్కరూ అభివృద్ధిని చర్చించాలని పిలుపునిచ్చారు.

భూపాలపల్లి మరింత అభివృద్ధి..

భూపాలపల్లి మరింత అభివృద్ధి చెందేందుకు మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో మెడికల్ కాలేజీతో పాటు, 500పడకల ఆస్పత్రి అన్ని హంగులతో నిర్మించారని చెప్పారు. అన్ని జిల్లా అధికార కార్యాలయాలను నిర్మిస్తున్నారని తెలిపారు. అది కేవలం ముఖ్యమంత్రి చొరవతోనే అన్నారు. ప్రతిపక్షాలవి అసత్య ప్రచారాలని రాష్ట్ర ఇన్‌చార్జ్ నర్సిరెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలు ఎవరూ నమ్మరాదని సూచించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. 60సంవత్సరాల కాలంలో చేయలేని అభివృద్ధిని కేవలం 8సంత్సరాలలో చేసి చూపించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకులు, పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

చిట్యాల: ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో రూ.35 లక్షల నిధులతో మినీ స్టేడియం క్రీడా కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.25 లక్షలతో నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రైతు విమోచన రాష్ట్ర కమిటీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, ఎంపీ దయాకర్, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లతో కల్లాల నిర్వాహకులు కుమ్మక్కు



అదనపు కలెక్టర్ గణేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం అదనపు కలెక్టర్ వైవీ. గణేశ్‌కు వినతి పత్రం అందించారు. రైతులు అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయి ఇబ్బంది పడుతుంటే పండిన పంటను కొనుగోలు చేసే విషయంలో దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. కల్లాల వద్ద కాంటాలు నిర్వహించి వేల సంఖ్యలో బస్తాలు నిల్వ ఉంటున్నాయని లారీలు సకాలంలో రాక పోవడంతో రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. ప్రభుత్వం కోతలు విధించకుండా ధాన్యం దిగుమతులు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినా మిల్లర్లు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. క్వింటాకు 3 నుంచి 5 కిలోల ధాన్యం కోతలు విధిస్తున్న ప్రభుత్వం తరపున గొప్పలు చెప్పుకునే ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణాకర్, ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, బలరాం,రాజునాయక్, జవహర్‌లాల్, ఉత్తమ్‌కుమార్, రవీంద్రాచారి పాల్గొన్నారు.

మనస్తాపంతో దివ్యాంగుడి ఆత్మహత్య


రాజు(ఫైల్)

సంగెం: పుట్టినప్పటి నుంచి కాళ్లు చచ్చుబడిపోవడంతో ప్రతి చిన్న అవసరానికి తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తున్నదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన దివ్యాంగుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాగితాల లక్ష్మి, ధర్మయ్యల చిన్న కుమారుడు రాజు(36) పుట్టుకతో రెండు కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని పరిస్థితి. మానసిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే. దీంతో కాలకృత్యాలతో పాటుగా ప్రతి పనికి తల్లిదండ్రులపైనే ఆధారపడుతుండేవాడు. ఈక్రమంలో తల్లిదండ్రుల సాయం లేనిదే ఏ పని చేసుకోలేకపోతున్నానని మధనపడుతుండేవా డు. తల్లిదండ్రులు ధైర్యం చెప్పినా తాను మాత్రం బాధపడుతూనే ఉండేవాడు. ఈ నెల 26న తల్లిదండ్రులు ఓ ఫంక్షన్‌కు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజు జీవితంపై విరక్తితో గడ్డిమందు తాగాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రాజు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ..

కామేపల్లి(కారేపల్లి): కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురికి చెందిన లకావత్ సుమలత(28)కు మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బీఆర్ఎస్ తండాకు చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉండగా, మూడు రోజుల క్రితం కుటుంబంలో గొడవలు జరగడంతో సుమలత నెమలిపురిలోని పుట్టింటికి వచ్చింది. అప్పటికే సునీత తల్లిదండ్రులు దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లారు. దీంతో తన పిల్లలను తీసుకురావాలని బంధువులను సునీత బీఆర్ఎస్ తండాకు పంపించగా పిల్లలను పంపేది లేదని భర్త చెప్పడంతో తిరిగొచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన సుమలత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

ఉన్నతవిద్యలో వర్సిటీల పాత్ర కీలకం

- న్యాక్‌పీర్ టీం చైర్మన్, మాజీ వీసీ సుగమ్‌ఆనంద్
- కేయూలో ముగిసిన న్యాక్ పీర్ టీం పర్యటన


నివేదికను వీసీ రమేష్‌కు అందజేస్తున్న న్యాక్‌టీం

కేయూ క్యాంపస్: ఉన్నతవిద్యలో విస్తృతమైన మార్పులు రాబోతున్నాయని, కావున విశ్వవిద్యాలయాల పాత్ర కీలకంగా ఉండాల్సిన అవసరం ఉందని నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) పీర్ టీం చైర్మన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలోని అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సుగమ్‌ఆనంద్ అన్నారు. న్యాక్ టీం చైర్మన్ సుగమ్ ఆనంద్‌తోపాటు మరో ఆరుగురు సభ్యుల బృందం మూడు రోజులుగా కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాలు, కళాశాలలు, హాస్టళ్లు, మెస్‌లు, హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అకాడమిక్, పరిశోధన, ప్రాజెక్టులు, మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే అంశాలపై అధ్యయం చేశారు. శనివారం సాయంత్రం కేయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన ఎగ్జిట్ మీటింగ్‌లో సుగమ్ ఆనంద్ మాట్లాడారు. ఉన్నత విద్యలోనూ ప్రైవేటీకరణ పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయాలు మనుగడ సాధించాలంటే మన సేవలను, బలాలను బహిరంగపర్చాలన్నారు. అనంతరం న్యాక్ టీం రూపొందించిన రిపోర్టును సీల్డ్ కవర్‌లో సుగమ్ ఆనంద్ కేయూ వీసీ తాటికొండ రమేష్‌కు అందించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు, ఐక్యూఏసీ డైరెక్టర్ నర్సింహాచారి పాల్గొన్నారు.

ఉపయోగపడే పరిశోధనలుపై దృష్టిసారించాలి

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలని విభాగాల అధిపతులకు సూచించారు. శనివారం ఉదయం సెనెట్‌హాల్‌లో విభాగాల అధిపతుల సమావేశంలో విభాగాల వారీగా మీ పరిధిలో డిపార్టుమెంట్ల గురించి తెలియజేయాలని కోరగా పలువురు విభాగాల అధిపతులు తమ పరిశోధనలు, ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈసందర్భంగా న్యాక్‌బృందంలో ఓ సభ్యుడు మాట్లాడుతూ.. కొత్త అంశాలతో సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేయాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీలో 28 విభాగాలల్లో కేవలం 4వేల మంది వరకే విద్యార్థులున్నారని విద్యార్థుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

న్యాక్ పీర్ టీంను కలిసిన చీఫ్ విప్

కాకతీయ యూనివర్సిటీలో గత మూడు రోజులుగా పర్యటిస్తున్న నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) పీర్ టీం చైర్మన్ సుగమ్ ఆనంద్, ఇతర సభ్యులను శనివారం కేయూలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. కాసేపు ఆ బృందంతో ముచ్చటించారు. కాకతీయ యూనివర్సిటీ విద్యాప్రమాణాలు, పరిశోధనల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందని యూనివర్సిటీ గురించి తెలియజేశారు. అనంతరం న్యాక్ పీర్‌టీం చైర్మన్ ఇతర సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీసీ రమేష్, బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బాధ్యులు కొమురయ్య, యువజన నాయకులు డాక్టర్ వీరేందర్, లంక రాజగోపాల్, గొల్లపెల్లి వీరస్వామి, తిరుపతి, అనిల్, అరుణ్ ఉన్నారు.

తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్

- ప్రొఫెసర్ కోదండరాం


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కోదండరాం

హన్మకొండ చౌరస్తా: యువకుల ఆత్మబలిదానాలతో వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ తన కుటుంబం కోసం అక్రమ, ఆర్థిక సామ్రాజ్య విస్తరణ కోసం దోచుకుంటున్నాడని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హనుమకొండలోని టీజేఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కోదండరామ్ మాట్లాడారు. తెలంగాణ వనరులను, కాంట్రాక్టులను సీమాంధ్ర కాంట్రాక్టర్లకు, కార్పొరేట్లకు అమ్ముకుంటున్న దళారీ పాలకులకు గోరీ కట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణ జనసమితి తెలంగాణ సమాజాన్ని మళ్లీ ఏకంచేసే దిశగా ప్లీనరీ నిర్వహిస్తున్నామని అన్నారు. జూన్ 4న ఉదయం 10గంటలకు సూర్యాపేటలో జరిగే టీజేఎస్ 3వ ప్లీనరీకి పెద్ద ఎత్తున హాజరు కావాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. అనంతరం టీజేఎస్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిల్లా రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా దేశబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎదులాపురం తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా సాంబయ్య, కిరణ్, సాంబరాజు, మహేష్‌లు ఎన్నికైనట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) గ్రామానికి చెందిన లాడె రాజబాబు (42) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన లాడె రాజబాబు శుక్రవారం రాత్రి తన వ్యవసాయ పనులను ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో సబ్ స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తిని తప్పించబోయి వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతిని తండ్రి రాజీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎండీ షాఖాన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ దుర్మరణం

- మృతుడు మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి సోదరుడు


ప్రమాదంలో ధ్వంసమైన కారు


పురుషోత్తం రెడ్డి (ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి వద్ద వరంగల్–నర్సంపేట రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వేం పురుషోత్తంరెడ్డి(68) మృతి చెందారు. ఆయన మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి స్వయానా అన్న. పురుషోత్తంరెడ్డి భార్య, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని హంటర్‌రోడ్డులో ఉంటున్న వేం పురుషోత్తంరెడ్డి కేసముద్రం మండలంలోని తన స్వగ్రామం అర్పనపెల్లికి వెళ్లి తిరిగి వస్తున్నక్రమంలో మధ్నాహ్నం 2 గంటలకు గంగదేవిపల్లి వద్దకు రాగానే వరంగల్ వైపు వెళ్తున్న ఆయన కారును వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవింగ్ చేస్తున్న పురుషోత్తం రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సీటు బెల్టు పెట్టుకోలేదని తెలుస్తోంది. గీసుకొండ ఎస్సై శ్వేత సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ జంగిలి సదయ్య అజాగ్రత్తగా, అతి వేగంగా బస్సును నడపడంతో తన భర్త మృతి చెందాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. పురుషోత్తంరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా ఒకరు అమెరికాలో ఉంటున్నారు. మృతదేహానికి ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులు హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఇంటికి తరలించారు.

పలువురి పరామర్శ..

బాధిత కుటుంబ సభ్యులు, అతడి సోదరుడు మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డిని ములుగు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యేలు సీతక్క, నన్నపనేని నరేందర్, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, గీసుకొండ ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, పలువురు పరామర్శించారు.

రేవంత్ రెడ్డి సంతాపం.. నేడు రాక

వరంగల్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్ రెడ్డి సోదరుడు కేసముద్రం మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా.. వేం పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులను రేవంత్ రెడ్డి ఆదివారం పరామర్శిస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

అభివృద్ధి, సంక్షేమంలో నంబర్ వన్

- వచ్చే నెలలో మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఖ్యాతి గడించిందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం కొడకండ్ల, ఏడునూతులలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో ఎర్రబెల్లి ట్రస్ట్ చైరపర్సన్ ఉషాదయాకర్‌రావుతో కలిసి పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని వినూత్న ప్రజాసంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎడారిలాంటి ప్రాంతాల్లోనూ సాగునీటి పరవళ్లు తొక్కుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినా రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ మోటార్లకు మీటర్ల ఏర్పాటుకు అంగీకరించలేదని చెప్పారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో కాంగ్రెస్, బీజేపీలు ప్రగల్భాలు పలుకుతూ ప్రజల ముందుకొస్తున్నాయని, గడిచిన 50 ఏళ్లలో ఏం జరిగింది.. తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అభివృద్ధిని విశ్లేసించుకోవాలని కోరారు. గెలిపించిన ఆదరించిన ప్రజల రుణాన్ని అభివృద్ధితో తీర్చుకుంటున్నానని చెప్పిన మంత్రి.. ఏడాదిలో ఇళ్లులేని వారు సొంత స్థలంలో నిర్మించుకోవడానికి మంజూరు చేయిస్తానని, నెలలోపు మిగిలిపోయిన వారికి ఫించన్‌లు మంజూరు చేస్తామని చెప్పారు. పద్మశాలీలు అధికంగా ఉన్నందున పట్టుబట్టి మినీ టెక్స్‌టైల్ పార్క్ మంజూరు చేయించానని, వచ్చే నెలలో శంకుస్థాపన చేయిస్తానని పేర్కొన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నానని వివరించారు. అనంతరం నర్సింగాపురంలో జీపీ భవన నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల నీటిలో మునిగి ముగ్గురి మృతి

నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని గొల్లపల్లిలో ఓ బాలుడు కుంటలో పడి మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దపల్లి కిరణ్– కవితలకు కుమారుడు రాజేష్ (12), కుమార్తె ఉన్నారు. శుక్రవారం సాయంత్రం బాలుడు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బాలుడి ఆచూకీ కోసం వెళ్లగా గ్రామ శివారు కుంటలో రాత్రి శవమై తేలాడు. బాలుడు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందాడని భావిస్తున్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై జానీపాష తెలిపారు.

మల్లన్న గండి రిజర్వాయర్‌లో..


శేఖర్ మృతదేహం

చిల్పూర్/ దేవరుప్పుల: జనగామ జిల్లా చిల్పూరు మండలం గార్లగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లన్న గండి రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు మునిగి శనివారం ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. దేవరుప్పుల మండలం ధర్మగడ్డ తండాకు చెందిన భూక్య శేఖర్(20) కిట్స్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం పరకాలకు చెందిన తోటి మిత్రులు కార్తీక్, విశ్వాస్‌లతో కలిసి మల్లగండికి చేరుకున్నారు. ఈక్రమంలో శేఖర్ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునుగుతుండడంతో స్నేహితులు కాపాడమంటూ అరవడంతో చుట్టు పక్కల రైతులు చేరుకుని గాలించగా శవమై కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. మల్లన్నగండి రిజర్వాయర్‌లో మృతిచెందిన విద్యార్థి భూక్య శేఖర్ స్వగ్రామమైన ధర్మగడ్డతండా(దేవరుప్పుల)లో శనివారం విషాదం అలుముకుంది. ధర్మగడ్డతండాకు చెందిన భూక్య మేర్‌సింగ్ ఇరవై ఏండ్ల క్రితం కుటుంబంతో సహా హనుమకొండకు వెళ్లి ఆటో నడిపేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల కిందట మేర్‌సింగ్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో భార్య లక్ష్మీ కుమారుడు శేఖర్ చదువుకోసం ఇంటింటా కూలీ పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం ధర్మగడ్డలో వారసత్వం భూమిని పెద్దమనుషుల సమక్షంలో చర్చించేందుకు వచ్చి, స్నేహితులతో కలిసి వెళ్లి నీటిలో మునిగి విగతజీవిగా మారాడు.

సమ్మక్క బ్యారేజీలో పడి యువకుడు..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీలో చేపల వేటకు వెళ్లిన తూరం రామకృష్ణ నీటిలో మునిగి మృతిచెందాడు. రామకృష్ణ తండ్రి శ్రీను, ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాజన్నపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్దకు చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో రామకృష్ణ కాలు జారి నీటిలో పడిపోయాడు. తోటి స్నేహితులు రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఎస్సై సురేష్ సహాయక చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. ఏటూరునాగారంలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

వల్మిడికి విదేశీ వాణిజ్య సంబంధాలు

- చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి


చారిత్రక వస్తు సంపద


నాలుగు కాళ్ల రోలు


పురాతన వస్తువులతో రత్నాకర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా వల్మిడి గ్రామానికి విదేశీ వాణిజ్య సంబధాలున్నట్లు ఆధారాలు లభించాయని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో పర్యటించిన ఆయన తన పరిశోధన వివరాలను వెల్లడించారు. మూడు వేల సంవత్సరాల క్రితం వల్మిడి గుట్ట, మునులగుట్ట, పెద్దమ్మబండ కేంద్రంగా బృహద్ శిలాయుగం, శాతవాహనముల కాలం నాటి సంస్కృతి విలసిల్లినట్లు అనేక ఆధారాలున్నాయని చెప్పారు. రామాలయం ఉన్న గుట్ట నుంచి మంచుప్పులకు వెళ్లే దారికి రెండు వైపుల గుట్టల దిగువన విశాలమైన 'పాటి మీద'(దుబ్బ) అని పిలిచే ప్రాంతం ఉందని తెలిపారు. రాముని గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఎత్తైన రోడ్డు మార్గం వేయడానికి తీసిన కందకాల్లో, రోడ్డుకు ఇరువైపులా సాగు భూముల ఉపరితలంలో అనేక మృణ్మయపాత్రలు(మట్టి పాత్రలు) కనిపిస్తున్నాయన్నారు. జనగామ జిల్లాలోని అనేక గ్రామాల్లో శాతవాహనుల కాలం నాటి ఇటుకలు లభించాయని, వల్మిడి పాటి మీద కూడా పెద్దపెద్ద ఇటుకలు, గృహ అవసరాలు, అలంకరణకు ఉపయోగించే రౌలెటెడ్ వేర్ అని పిలుచుకునే రోమన్ పాత్రలు, పిల్లల చేతిలో ఇమిడే చిన్న మట్టి కుండలు, ఎరుపు, ముదురు ఎరుపు, నలుపు, బూడిద రంగులతో అనేక డిజైన్ల మట్టి పాత్రలు, ధాన్యం నిల్వకు ఉపయోగించే గాబులు, పసి పిల్లలకు పాలు తాగించే మట్టి పాత్రలు, నాణ్యత లోపించిన మట్టి పూసలు, చేతితో చేసి కాల్చిన ఎద్దు బొమ్మలు, ఒక ఫీటు కంటె పొడవైన నా లుగు కాళ్ల రాతి పీటలు, రాతి గోడ్డళ్లు, రాతి పనిముట్లు ఇక్కడ లభించాయన్నారు. గుట్టకు వెళ్లే తోవలో ఎడమ వైపు రోడ్డు నుంచి ఎర్రచెరువు మత్తడి వాగు, తునికాకు బండ వరకు చిట్టెపురాళ్లు, ఇనుప ముక్కలతో నేల ఉపరితలం కప్పి ఉందని, ఇనుము, ఉక్కు ముద్దలు చేయడానికి కమ్మరి కొలుములు ఉన్నట్లు కనిపిస్తున్నాయని వివరించారు. చరిత్ర పూర్వ యుగం నుంచే వల్మిడి గుట్టలో మానవ నాగరికత ప్రారంభమైనట్లు ఆనవాళ్లు ఉన్నాయని తెలుస్తోందన్నారు. విదేశీ వ్యాణిజ్యం చేసిన నిపుణులైన కమ్మరి, కుమ్మరులు ఇక్కడ ఉన్నట్లు ఆధారాలు చెబుతున్నాయన్నారు. శాతవాహనుల కాలంలో భూమార్గంలో సూర్యాపేట మీదుగా మచిలీపట్నం ఓడ రేవు చేరి అక్కడి నుంచి జలమార్గంలో రోమ్ సామ్రాజ్యంలో వాణిజ్య సంబంధాలు నెరిపినట్లు తెలంగాణలో చారిత్రక ఆదారాలు లభించాయన్నారు. వల్మిడిలో లభించిన రోమన్ పాత్రలు, ఇక్కడ తయారైన ఇనుము, ఉక్కు ముద్దలు ఇతర దేశాలకు ఎగుమతి అయినట్లు తెలుస్తున్నదని అన్నారు. వల్మిడిలో రాక్షస గూళ్ల సమాధులు, బౌద్ధ స్తూపాలకు ఉపయోగించే లైమ్ స్టోన్ రాతి ముక్క లభించినట్లు తెలిపారు.

వల్మిడి పూర్వపు పేరు గుల్మిడి

రామాయణం రాసిన వాల్మీకి పేరుతో వల్మిడి గ్రామంగా నామం స్థిర పడిందని స్థానికులు చెబుతున్నట్లుగా ఆధారాలు ఏమీ లభించలేదని రత్నాకర్‌రెడ్డి తెలిపారు. అయితే శాతవాహనుల కాలంలో ఐదు గ్రామాలను కలిపి నియమించే అధిపతిని గుల్మికుడు అంటారని, నాటి గుల్మిడి నేడు వల్మిడిగా ప్రసిద్ధి చెంది వుండవచ్చని అన్నారు.

హౌస్ సర్జన్, పీజీ వైద్యుల స్టైఫండ్ పెంపు

ఎంజీఎం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యవిద్యలో భాగంగా విధులు నిర్వర్తించే హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులు, సీనియర్ రెసిడెన్స్ వైద్యుల స్టైఫండ్‌ను 15శాతం పెంచుతూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్సు	ప్రస్తుత స్టైఫండ్	పెంచిన స్టైఫండ్
హౌస్‌సర్జన్ మెడికల్	22,527	25,906
హౌస్‌సర్జన్ డెంటల్	22,527	25,906
పీజీ డిగ్రీ		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61528
మూడవ సంవత్సరం	56,319	64,767
పీజీ డిప్లొమా		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61,528
సూపర్ స్పెషాలిటీ		
మొదటి సంవత్సరం	80,500	92,575
రెండో సంవత్సరం	84,525	97,204
మూడో సంవత్సరం	88,547	10,11829
ఎండీఎస్		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61,528
మూడో సంవత్సరం	56,319	64,767
సీనియర్ రెసిడెంట్స్	80,500	92,575

టీఎస్ ఐసెట్ ప్రశాంతం



ప్రవేశపరీక్షకు ప్రశ్నపత్రం సెట్‌ను ఎంపిక చేస్తున్న కేయూ వీసీ రమేష్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈవిద్యాసంవత్సరం (2023–2024) ప్రవేశాలకుగాను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టీఎస్ ఐసెట్ వరంగల్ జిల్లాలోని 9 పరీక్ష కేంద్రాల్లో శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొదటి సెషన్‌లో 2,100 మంది విద్యార్థులకు గాను 1,965మంది (93.6శాతం) హాజరయ్యారు. రెండో సెషన్‌లో 2,001 మందికిగాను 1,948మంది(92.8శాతం) మంది హాజరయ్యారని సెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ వరలక్ష్మి తెలిపారు. నర్సంపేటలోని పరీక్షాకేంద్రంలో మొదటి సెషన్‌లో 153మందికి గాను 146మంది(95.4శాతం)హాజ రుకాగా.. రెండో సెషన్‌లో 152మందికిగాను 141మంది (92.8) శాతం హాజరైనట్లు వెల్లడించారు. కాగా, జూన్ 5న టీఎస్ ఐసెట్ ప్రిలిమినరీ కీ విడుదల చేసి, జూన్ 6నుంచి 8వ తేదీవరకు అభ్యంతరాలను స్వీకరించి, 20న ఫలితాలను వెల్లడించనున్నట్లు కన్వీనర్ వరలక్ష్మి పేర్కొన్నారు.

ప్రాణం తీసిన చేపలవేట


ప్రవీణ్ (ఫైల్)

గూడూరు: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఏపూరు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపూరుకు చెందిన బానోతు ప్రవీణ్ (28) మురారి అనే వ్యక్తి కల్సి సమీప పాకాలవాగులో విద్యుత్ వైర్ అమర్చి చేపలు పట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాగునీటిలో విద్యుత్ వైర్ పెట్టిన విషయం మరిచారు. చేపల కోసం వెళ్లిన ఇద్దరిలో ప్రవీణ్ నీటిలోకి దిగాడు. ఆ సమయంలో విద్యుదాఘాతం సంభవించి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనను గుర్తించిన మురారి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెల్సుకున్న ఎస్సై దిలీప్ సిబ్బందితో అక్కడికి చేరుకొని సంఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సోనుతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.